

# పుత్రుడు

## గొల్లపూడి దుర్గావళి

కౌళేశ్వరరావు మార్కెట్టంతా మూ డు సార్లు కలియ తిరిగి కళ్ళు పెద్దవి చేసుకుని మరీ చూశాడు సుబ్బారావు. అక్కడనించి గవర్నరుపేట మార్కెట్టుకి, ఆ తరవాత సత్యనారాయణపురం మార్కెట్టుకి పిచ్చిపట్టిన వాడిలా తిరిగాడు. అయినా ఫలితం శూన్యం అయింది.

అనుకున్నది సాధించలేనేమో అన్న దిగులు పట్టుకుంది మొదటి సారిగా సుబ్బారావుకి.

అయినా విసుగు చెందని విక్రమార్కుడిలా తన ప్రయత్నం ఏమాత్రం విరమించ తలుచుకోలేదు.

తాలూకా ఆఫీసు దగ్గర, మరో రైల్వే గేటు దగ్గర ఆఖరిసారిగా హడావుడి పడ్డాడు. ఊహూ...సుబ్బారావు ప్రయత్నానికి మళ్ళీ విఘ్నమే ఎదురయింది.

నిరాశగా నిట్టూరుస్తూ తను అప్రయోజకుడిగా మిగిలిపోతున్నందుకు మరింత బాధపడుతూ ఇంటివైపు తిరుగుముఖం పట్టాడు. ఉన్నట్టుండి సుబ్బారావు కళ్ళు వెయ్యి కేండిల్ బల్బుల్లా తళ్ళున మెరిశాయి. ఉత్సాహం పట్టలేక వడివడిగా అక్కడకు వెళ్ళాడు. ఎదురుగుండా ఆకువచ్చగా,

ఆరోగ్యంగా నిగనిగలాడుతూ నిండుగా ఉన్న ఆ కాకరకాయల తట్ట... నిజం చెప్పొద్దూ, సుబ్బారావుకి ఆ తట్టను చూస్తుంటే దాన్ని అమాంతం ఎత్తుకుని ఎక్కడికైనా పారిపోదామా అన్నంత అసూయ కలిగింది. అప్పటికే అక్కడ రేషన్‌కార్డు లేకుండా వంచదార వంచిపెడుతున్నారా అన్నంతగా జనం చేరిపోతున్నారు.

"కిలో ఎంతేయ్?" అని అడిగిన సుబ్బారావుకి అరగంట తరవాత కానీ "ఎనిమిది రూపాయలు" అన్న జవాబు వినిపించింది కాదు. అతను రేటు గురించి ఆలోచిస్తూ ఉండగానే మూడు వంతుల భాగం తట్ట ఖాళీ అయింది. ఊరుకుంటే అవికూడా అయిపోతాయేమో అని జనంలోంచి చొచ్చుకుపోయాడు. మరో అరగంట తరవాత రేగిన తలతో, నలిగిన బట్టలతో ముఖం నిండా చెమటలు కారుకుంటూ ఒలింపిక్ క్రీడల్లో మొదటిసారి గెలిచిన క్రీడాకారుడిలా కిలో కాయలతో బయటపడ్డాడు సుబ్బారావు. అతని మనసంతా అనిర్వచనీయమైన ఆనందంతో తృప్తితో నిండిపోయింది.

ఇంటికి వెళ్ళి పడ్డ కష్టాన్నీ, పొందిన ఫలితాన్నీ భార్యకి విన్నవించాడు.

"మీ కేమైనా బుద్ధి ఉందాంట? ముష్టి తద్దినానికి కిలో కాకరకాయలు ఎనిమిది రూపాయలు పెట్టి తెస్తారా? ఇవి లేకపోతే ఆ ముసలిదాని తద్దినం ఆగి తగలడుతుందా? మీ తెలివి తెల్లవారినట్లే ఉంది! రూపాయో అర్ధో పెట్టి ఏ అర కిలో బీరకాయల్లో తేక ఇంత ఖర్చు పెడతారా??"అంటూ మండిపడింది వరలక్ష్మి.

"కాదు వరం! అమ్మకి ఆ కాకరకాయ కూర అంటే ఇష్టం అందుకని..."అంటూ తెల్లముఖం వేసి నీళ్ళు నమిలాడు.

"ఏడాదినాడు చచ్చిందానికి ఇంకా ఇష్టాలు ఏమిటండీ? బతికుండగా తింటే దండగ అనుకుంటే చచ్చాక ఈ తద్దినాలు ఒకటి! ఇట్లా అయితే మనం బతికినట్లే!"అంది విసురుగా.

"అది కాదు వరలక్ష్మీ! అమ్మ దిన వారాలు అయ్యాక మళ్ళీ ఒక్క మాసికం అయినా పెట్టలేదు. అందుకని తద్దినం అయినా బాగా పెట్టాలని..." అంటూ గుటకలు మింగాడు.

"ఇదేం పెళ్ళా పేరంటమా బాగా చెయ్యటానికి? ఏళ్ళు వచ్చాయి ఎందుకూ బుద్ధి లేకపోయాక!" అని గయ్యిమంది వరలక్ష్మి.

భార్య కోపం సంగతి తెలిసిన సుబ్బారావు మౌనంగా ఉండిపోయాడు.

xx xx xx

సుబ్బావధాని హడావుడిగా ఆర్భాటంగా మంత్రాలు చదువుతున్నాడు. మధ్య మధ్యలో సుబ్బారావు ఒంటిమీదున్న జంధ్యాన్ని అటూ ఇటూ మార్చుకోమంటున్నాడు. తద్దినం తంతు యథావిధిగా సాగిపోతూంది.

"అమ్మా వడ్డించండి" అంటూ వంటింట్లోకి వినిపించేలా గావుకేక పెట్టాడు సుబ్బావధాని. పదార్థాల పళ్ళెం పట్టుకు వచ్చింది వరలక్ష్మి.

సుబ్బారావు తన తల్లికి ఇష్టమైన ఆ కాకరకాయ కూర వరలక్ష్మి విస్తట్లో ఎప్పుడు వడ్డిస్తుందా, దాన్ని అంత రేటు పెట్టి తెచ్చినందుకు తల్లిమీద తనకు గల ప్రేమని వాళ్ళు ఎలా పొగిడి ప్రశంసిస్తారో విని, ఆనందించాలని తెగ ముచ్చట పడిపోతున్నాడు.

"అమ్మా దుంపకూరలు ఈ దిక్కు, కాయకూరలు ఆ దిక్కు, భక్ష్యాలు, క్షీరాన్నం ఈ దిక్కు" అంటూ దిక్కులు సూచిస్తున్నాడు సుబ్బావధాని.

విస్తట్లో వడ్డించబోతున్న పదార్థాన్ని పరికించి చూస్తున్న సుబ్బావధాని "ఏమి టా పదార్థం?" అన్నాడు వరలక్ష్మితో.

"ఆ కాకరకాయ కూర" అంది.

"వడ్డించకండి, దాన్ని కాశీలో వదలి వచ్చాను కనుక అది నిషిద్ధం" అన్నాడు ఠక్కున.

ఆయన మాటలకు దెబ్బ తిన్న పక్షిలా విలవిలలాడాడు సుబ్బారావు. రెండో విస్తట్లో వడ్డించబోయింది వరలక్ష్మి.

"వద్దు వద్దు, ఒకరికి నిషిద్ధం అయిన పదార్థం మరొకరికి వడ్డించరాదు"అన్నాడు రెండో భోక్త.

ఏడుపు ముంచుకు వచ్చింది సుబ్బారావుకి. తల్లికి ఎంతో ఇష్టం అని ఊరంతా తిరిగి తిరిగి ఆ కాకరకాయలు తెస్తే అద్ది తల్లికి ముట్టనందుకు, వ్యర్థం అయినందుకు లోలోపల చెప్పలేనంత బాధ పడ్డాడు. తల్లిని ఆ కాకరకాయల ద్వారా తృప్తిగా సరాసరి స్వర్గానికి చేర్చలేకపోయినందుకు బోలెడు దిగులు పడ్డాడు. అదే ఆలోచనతో రాత్రి నిద్రపోలేక పోయాడు సుబ్బారావు.

xx xx xx

"నాయనా సుబ్బూ నా కోసం కష్టపడి ఆ కాకరకాయలు తెచ్చావురా? నే నంటే ఎంత ప్రేమ నీకు! చచ్చిపోయాక నా తృప్తి కోసం ఎంత శ్రమ పడ్డావు నాయనా"అంటూ ప్రేమగా కొడుకు తల నిమురుతోంది బోసి నోటితో నవ్వుతూ సుబ్బారావు తల్లి. ఉలిక్కిపడి లేచాడు సుబ్బారావు. ఆయోమయంగా చుట్టూ చూశాడు. అప్పటికికానీ తనకు వచ్చింది కల అని గుర్తించలేదు.

తల్లి తృప్తిగా తనను మెచ్చుకుందని మొదట్లో సంతోషించినా కొద్ది సేపు గడిచాక కానీ, ఆవిడ మాటల్లో అంతరార్థం బోధపడలేదు సుబ్బారావుకి. ఆ తరవాత సిగ్గుతో కుంచించుకుపోయాడు.

నిజమే బతికుండగా అమ్మకి ఏనాడైనా కడుపు నిండా తిండి పెట్టానా? 'నాకు ఆ కాకరకాయ కూర తినాలని ఉందిరా సుబ్బూ, తెచ్చి పెట్టవూ' అని ఆఖరిసారి నోరు తెరిచి అడిగితే 'రేపో మాపో చచ్చేదానివి నీకు ఇంకా కోరికలు ఏమిటీ నోరు మూసుకుని పెట్టిందేదో తిను. నీకు విరేచనాలు పెడుతుంటే నేనూ, నా పెళ్ళాం చెయ్యలేక చస్తున్నాం.

మళ్ళీ ఇలా అవీ ఇవీ తెమ్మని ఎప్పుడైనా అడిగావంటే ఈ తిండికూడా పెట్టం జాగ్రత్త' అన్నాడు తను.

చనిపోయే ముందు 'ఆకలి.. ఆకలి' అంటూ ఆకలితోనే అలమటించి పోయింది అమ్మ. ఆవిడ కోరిక ఏం తీర్చాడని తను? ఒంటి నిండా బట్ట లేక, కడుపు నిండా తిండి లేక ఎంత బాధపడింది! ఆవిడమీద తను ఎంతగానో విసుక్కునేవాడు; తొందరగా చచ్చిపొమ్మని తిట్టేవాడు. ఆఖరికి ఒకటి రెండుసార్లు కన్నతల్లి అనైనా చూడకుండా చెయ్యి చేసుకున్నాడుకూడా. తను చేసింది ఎంత దారుణమైన తప్పో అర్థం అయింది సుబ్బారావుకి.

బతికి ఉన్నన్నాళ్ళూ ఆవిడకి ఇష్టమైనవి పెట్టకుండా మాడ్చి చంపి చనిపోయాక ఘనంగా శ్రార్ధకర్మలు చేస్తేను, తద్దినానికి ఇష్టమైనవి వండి పెడతేనూ, బ్రాహ్మణులకి బట్టలు పెడితేనూ ఆవిడ ఆత్మ సంతృప్తి చెందుతుందా?

పుత్రుడు పుడితే పున్నామనరకం నుంచి రక్షిస్తాడని ఆశ పడతారు తల్లితండ్రులు. కానీ, తనలాంటి పుత్రుడు బతికుండగానే నరకాన్ని చూపించి చనిపోయాక వాళ్ళని తృప్తి పరిస్తే వాళ్ళ ఆత్మలు సంతృప్తి పొందుతాయా? ఊహూ.

బ్రతికి ఉండగా తల్లితండ్రుల్ని ప్రేమగా, ఆదరంగా చూసి వాళ్ళ కోరికలను తీరిస్తే, ఏ లోటు లేకుండా వాళ్ళు ప్రశాంతంగా కళ్ళు మూస్తే అలాంటి వాళ్ళకు ఆ కొడుకు శ్రార్ధం పెట్టకపోయినా ఫరవాలేదు. జీవి బతికి ఉన్నంత వరకే తృప్తిని అనుభవించేది. చనిపోయాక ఏం అవుతుందో, ఎలా పోతుందో ఎవరికి తెలుసు? తల్లితండ్రులను బతికి ఉన్నప్పుడు సంతృప్తి పరచినవాడే నిజమైన పుత్రుడు. తను ఎలాంటి దౌర్భాగ్యపు పుత్రుడో మొదటిసారిగా తెలిసి వచ్చింది సుబ్బారావుకి. ✱

